నేడు 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమల్లో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సీఐ పి.శ్రీను ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని పేర్కొన్నారు. పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్సైలు మణి, విజయలక్ష్మి, పాపారావు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: ఆగిరిపల్లి మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఎస్సై చంటిబాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో వివాదాస్పద అంశాల జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేతన ఒప్పందం చేయాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఐటీసీ ఎల్పీజీ ప్లాంట్ కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సెంట్రల్ డిప్యూటీ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. వేతన ఒప్పందం చేయకపోవడం ద్వారా కార్మికులు పడుతున్న ఇబ్బందులను సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ ఆయనకు వివరించారు.

రైతు శ్రేయస్సే ప్రధాన ధ్యేయం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



చంద్రాలలో సొసైటీ భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

చంద్రాల(మైలవరం): రైతు శ్రేయస్సే సహకార సంఘాల ప్రధాన ధ్యేయం అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో నిర్మించిన నంబర్ హెచ్ 1290 ది చంద్రాల విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ సొసైటీ భవనాన్ని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గుమ్మడపు రవీంద్రరాణాలతో కలిసి ఎమ్మెల్యే వసంత ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా రుణాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘాల ముఖ్య ఉద్దేశమన్నారు. రైతుల ఆర్థిక స్వావలంబన కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు.

రూ.50 లక్షలతో సిమెంట్ రహదారులు

పోరాటనగర్(మైలవరం): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం పోరాటనగర్‌లో రూ.50 లక్షలతో సిమెంట్ రహదారుల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే వసంత శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 20వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేశామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

చంద్రాల: మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో నూతన సొసైటీ భవన ప్రారంభోత్సవం అనంతరం ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడారు. సహకార సంఘం భవనానికి రూ.32 లక్షలు, లాకర్లకు మరో రూ.5లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు-నేడు పథకం కింద రూ.1.20 కోట్లతో అన్ని పాఠశాలలు భవనాలు నిర్మించామన్నారు. రూ.95 లక్షలతో సీసీ రహదారులు, రూ.65 లక్షలతో డ్రెయినేజీలు నిర్మించామన్నారు. రూ. 62లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధునికీకరణ, మరో రూ.8 లక్షలతో స్కూల్ భవనం పూర్తి చేసినట్లు వెల్లడించారు. సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలు చివరి దశకు చేరి, తుది మెరుగులు దిద్దుకుంటున్నాయన్నారు. గ్రామంలో 380 మంది పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలను మంజూరు చేశామన్నారు. ఎస్టీలు 14 మందికి గృహ నిర్మాణాలకు ఎస్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ నుంచి రూ.63వేల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. తుమ్మల గన్నవరంలో రూ.25 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. నీతి నిజాయతీతో నియోజకవర్గం అభివృద్ధికి పని చేస్తుంటే ప్రతి పక్ష నేతలకు మింగుడు పడటం లేదని విమర్శించారు. ఇకనైనా మాజీ మంత్రి తప్పుడు ప్రచారం మానుకోవాలని ఎమ్మెల్యే వసంత హితవు పలికారు.

దేవతామూర్తులకు శాకంబరి అలంకరణ

పెనుగొలను(గంపలగూడెం): ఆషాఢమాసం కార్యక్రమాల్లో భాగంగా పెనుగొలను పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో దేవతామూర్తులకు ఆదివారం శాకంబరి అలంకరణ చేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకులు రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో గణపతి, వీరంబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ, ఈశ్వరమ్మకు కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి రంగు సత్యనారాయణ పాల్గొన్నారు.

మల్లేలకు రూ.15 కోట్ల సంక్షేమ నిధులు

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో భాగంగా తిరువూరు మండలం, మల్లేలలో 932 కుటుంబాలకు రూ.15కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. మల్లేలలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలను కలిసి వారికి అందుతున్న పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లు ఎమ్మెల్యే అందజేశారు. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలను మంజూరు చేశామని, మల్లేల గ్రామంలో 90 శాతం కుటుంబాలలోని 4,118 మంది 22 పథకాల ద్వారా ప్రయోజనం కలిగిందన్నారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ కూడా ప్రారంభించామని, అంతర్గత రహదారుల అభివృద్ధికి, తాగునీటి అవసరాలకు కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. గ్రామ సర్పంచ్ వంగూరు మరియమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రవికుమార్, ఏఎంసీ చైర్మన్ నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వర రెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఏసుపాదం, రవికుమార్, కృష్ణారావు, నాగేశ్వరరావు, నెహ్రూ పాల్గొన్నారు.

రఘునందన్‌కు పురస్కారం



పురస్కారం అందుకున్న రఘునందన్

తిరువూరు: అభ్యుదయ రచయితల సంఘ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్‌కు గుంటూరు తెలుగు వెలుగు సాంస్కృతిక సంస్థ పురస్కారం లభించింది. భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞా రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను తెలుగు, హిందీ భాషల్లో రచించి, ఆయన పేరుతో పోస్టల్ కవరు కూడా విడుదల చేయించడంలో కృషి చేసిన రఘునందన్‌ను తెలుగు వెలుగు మహానంది పురస్కారానికి ఎంపిక చేశారు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో రఘునందన్‌కు ఈ పురస్కారాన్ని సంస్థ నిర్వాహకులు రాజ్‌కుమార్, గౌరీ శంకరాచార్యులు అందజేశారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

తిరువూరు: దేశంలో మూఢ నమ్మకాలు పెరుగుతున్నాయని, వాటిని విడనాడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు-సైన్స్ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం పాఠ్యాంశాల్లో సైన్స్‌కు సంబంధించిన అంశాలను తొలగించడం, శాస్త్రీయ పరిశోధకులకు ఇచ్చే పురస్కారాలు రద్దు చేయడం విచారకరమన్నారు. జేవీవీ సభ్యులు హరికృష్ణ, రాంప్రదీప్, నాగేంద్రప్రసాద్, సుదర్శన్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: మండలంలోని కంభంపాడు, అట్లప్రగడ గ్రామాలకు చెందిన ఎం.రవీంద్ర, పి.అశోక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలోనూ, పిడుగుపాటుకు మృతి చెందిన చీమలపాడు గ్రామానికి చెందిన తుళ్లూరు రామారావు మృతిచెందారు. వీరి కుటుంబాలను ఆదివారం తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ భూక్య గనియా, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, సర్పంచ్‌లు కోట పుల్లమ్మ, మోర్ల లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ కోట పుల్లారావు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు చెన్నారావు, మాజీ సర్పంచ్ సతీష్, మోర్ల సాంబయ్య ఉన్నారు.

కరపత్రాల పంపిణీ

గంపలగూడెం: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భా గంగా గంపలగూడెంలో కరపత్రాల పంపిణీ చేశా రు. బీజేపీ నాయకులు వీ సుజాత, యుగంధర్, కే నాగ గోపాలకృష్ణ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నూజివీడు: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని బాపూనగర్‌లో ఆదివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలున్న కరపత్రాలను ఇంటింటికీ పంచిపెట్టారు. బీజేపీ నాయకులు శివరాజు వసుంధరాదేవి, రవికాంత్, వాసు, జనార్దనరావు, ఆలీషా, రవికిషోర్, నాగరాణి, నాగరాజు పాల్గొన్నారు.

21 మంది ఉపాధ్యాయులు చేరిక

చాట్రాయి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా 21 మంది ఉపాధ్యాయులు చేరినట్టు అయినట్లు ఎంఈఓ బ్రహ్మాచారి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొత్తం 45 ఖాళీలు ఉండగా 25 మంది ఉపాధ్యాయులు మండలంలో విధులు నిర్వహించేందుకు కోరుకున్నారని వారిలో 21 మంది చేరారని ఆయన పేర్కొన్నారు.

ఒకటో తేదీ నుంచి గ్రామ సభలు

గంపలగూడెం: ప్రజాసమస్యలు పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గంపలగూడెం మండలంలో జూలై ఒకటో తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పిచ్చిరెడ్డి తెలిపారు. మండల అధికారులు రెండు బృందాలుగా రోజుకు రెండు సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వంగవీటి మోహనరంగా ఆశయాలు ఆదర్శం



మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన వంగవీటి రాధ

రెడ్డిగూడెం: వంగవీటి మోహనరంగా ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లడం అభినందనీయమని మోహనరంగా తనయుడు వంగవీటి రాధ అన్నారు. రెడ్డిగూడెంలో కాపు సంఘం నాయకులు ఏర్పాటు చేసిన మోహన్‌రంగా విగ్రహాన్ని ఆదివారం రాత్రి రాధ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ రాజకీయ అనుభవంతో ప్రజల హృదయాలను గెలుచుకున్న ఏకైక నాయకుడు వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. తొలుత పాతనాగులూరు గ్రామం నుంచి రాధను బైక్, కార్ల ర్యాలీతో రెడ్డిగూడెంలోని రంగా విగ్రహం వరకు యువకులు తీసుకొచ్చారు. కాపుల బజార్‌లోని అంకమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అక్కల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడి మృతి

తిరువూరు: విస్సన్నపేట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మరసకట్ల ప్రభాకరరావు(55) రోడ్డు ప్రమాదంలో గాయలై చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మృతిచెందారు. 1995లో విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న ఆయన తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థిగా 1999, 2014 ఎన్నికల్లో పోటీచేశారు. ఆయన మృతికి సీపీఎం నాయకులు వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, భద్రం, రవి, శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

మైలవరం: 316డి లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో శనివారం రాత్రి జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడిగా జాస్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చలవాది గుప్తా హరీష్ కుమార్, కోశాధికారిగా తమ్మిన దినేష్‌బాబును ఎలక్ట్ గవర్నర్ శంకర్ గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు.

సంఘటితంగా ఉంటేనే ప్రగతి సాధ్యం

తిరువూరు: విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉంటే ఆర్థిక, సామాజిక ప్రగతి సాధించవచ్చని తిరువూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చామర్తి రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీవేంకటాచలస్వామి దేవస్థాన ఆవరణలో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. కుల వృత్తిపై ఆధారపడి జీవించే విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి సంఘం తరపున కూడా కార్యక్రమాలు చేపట్టాలని పలువురు సూచించారు. సంఘ కార్యదర్శి పమ్మి బ్రహ్మాచారి, సంఘ నాయకులు ఆర్ఆర్‌కే చారి, రమేష్, కృష్ణమాచారి పాల్గొన్నారు.